క్లుప్తంగా

లోక కల్యాణ పూజలు

అనంతవరం(క్రోసూరు): అనంతవరం గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సంక్రాంతి పండగ పురస్కరించుకుని లోక కల్యాణ పూజలు ఆదివారం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు పోతురాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొన్నారు.

అమరావతి సీఐగా వై.అచ్చియ్య



అమరావతి: అమరావతి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వై.అచ్చియ్య ఆదివారం అమరావతి సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో సీఐడీ సీఐగా ఆయన పనిచేశారు. ఇక్కడ సీఐగా పనిచేసిన మాకినేని శ్రీనివాసరావు వీఆర్‌కు బదిలీ అయ్యారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడటానికి ప్రజలతో, అన్ని శాఖలతో సమన్వయమై పనిచేస్తానన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఫేస్ వాష్



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ పోలీసులు ఫేస్ వాష్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న లారీలు, భారీ వాహనాలను పట్టణంలోని తాలూకా సెంటర్‌లో నిలిపి, డ్రైవర్లు ముఖం కడుక్కొని బయలు దేరేలా చూశారు. పట్టణ ఎస్ఐ ఎం సంధ్యారాణి మాట్లాడుతూ కంటి మీద కునుకు లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ముప్పాళ్ళ: సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై యు.సోమేశ్వరరావు ఆదివారం హెచ్చరించారు. గ్రామాల పరిధిలో ఎక్కడైనా కోడి పందేలు, జూదం నిర్వహిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

ఆటో బోల్తా, ఇద్దరికి గాయాలు

నకరికల్లు: ఆటో అదుపుతప్పి బోల్తాపడటంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని నర్సింగపాడు గ్రామం సమీపంలో రైల్వే ఫ్లైఓవర్ సమీపంలో ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నకరికల్లు నుంచి గుండ్లపల్లికి వెళ్తున్న ఆటోకు ఎదురుగా కోతులు రావడంతో ఆటో ఒక్కసారిగా డ్రైవర్ పక్కకు తిప్పాడు. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో ప్రయాణికుడు గుండ్లపల్లి గ్రామానికి చెందిన గుత్తికొండ మౌలాలికి తీవ్రగాయాలు కాగా ఆటో డ్రైవర్ నకరికల్లుకు చెందిన పెద్దినీడి శ్రీనివాసరావుకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరువురిని నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

పిండి వంటలు పంపిణీ



సత్తెనపల్లి: సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని పణిదం చేనేత సొసైటీ వద్ద గంజి రాములు, అంజమ్మ జ్ఞాపకార్థం కుమారుడు గంజి వీరాస్వామి ఆదివారం 100 కుటుంబాలకు పిండి వంటలు పంపిణీ చేశారు. సీఐ అవ్వారు వెంకటబ్రహ్మం ముఖ్య అతిథిగా పాల్గొని అందజేశారు. ప్రముఖ న్యాయవాది బగ్గి నరసింహారావు, గంజి వీరాస్వామి, పణిధం చేనేత సొసైటీ అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు, బండి పూర్ణ చంద్ర, కాకుమాను జోసెఫ్ కుమార్, వంగర శ్రీనివాసరావు, మారేళ్ల వీరాంజనేయులు ఉన్నారు.

నందిగామలో వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి: వ్యక్తి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కంచేటి శేషగిరిరావు (75) కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. హుటాహుటిన వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు కంచేటి నాగరాజు ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీరమ్మ కాలనీకి కష్టాలెన్నో..!

- కూలి పనులకు వలసొచ్చిన పేదల నివాసం
- మూడు దశాబ్దాలు గడుస్తున్నా.. మౌలిక వసతులు కరువు
- ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వని ప్రభుత్వాలు
- అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ
- వేసవిలో తప్పని నీటి ఎద్దడి



వీరమ్మ కాలనీ ఏరియల్ వ్యూ

రాజుపాలెం: పేదల కాలనీల రూపురేఖలు మారడం లేదు. రోడ్లన్నీ గుంతలమయంగా.. వాటిపై మురుగు ప్రవాహం.. అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం. ఇదీ.. మండలంలోని కోట నెమలిపురి పంచాయతీ పరిధిలోని కొండమోడు సమీపం వీరమ్మ కాలనీ దుస్థితి. దేవరంపాడు వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో 30 ఏళ్ల క్రితం ఈ కాలనీ ఏర్పడింది. సుదీర్ఘ ప్రాంతాల నుంచి బతుకుదెరువు కోసం చాలా మంది ఇక్కడికొచ్చి స్థిరపడ్డారు. కొండమోడులోని ముగ్గు క్వారీలలోకి పనికి వెళ్తుంటారు. చాలీచాలని కూలితో ఇక్కడి కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

మౌలిక వసతుల కొరత

ఈ కాలనీలో 268 గృహాలున్నాయి. 1,008 మంది జనాభా ఉన్నారు. ఇందులో కొంతమందికి మాత్రమే ఇళ్ల పట్టాలిచ్చారు. ఇప్పటికీ చాలా కుటుంబాలు పూరిపాకలోనే నివశిస్తున్నాయి. అక్కడి నుంచి పురోగతి రేకుల గృహాలకే చాలా వరకు పరిమితమైంది. కాలనీలో సైడు కాలువలు లేవు. దీంతో మురుగు రోడ్లపైనే పారుతోంది. దుర్వాసన వెదజల్లడమే కాక కాలనీ వాసులు నడవడానికి ఇబ్బంది పడుతున్నారు.



రోడ్లపైనే మురుగు పారుదల



పనిచేయని చేతిపంపు

తాగునీటి అవసరం తీర్చే చేతి పంపు కూడా పనిచేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

ఇళ్ల పట్టాలివ్వాలి..

వీరమ్మ కాలనీలో కొన్ని గృహాలకు మాత్రమే ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఇంకా చాలా మందికి ఇవ్వాలి. పట్టాలు ఇస్తే ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం ద్వారా పక్కా గృహాలు నిర్మించుకుంటామని, రిజిస్ట్రేషన్లు అవుతాయని స్థానికులు అంటున్నారు.

నీటి ఎద్దడితో ఇబ్బంది



వేసవికి కాలనీలో తీవ్రంగా నీటి ఎద్దడి ఏర్పడుతుంది. నేను కూలినాలి చేసుకుంటూ 25 ఏళ్ల క్రితం వచ్చి ఇక్కడ స్థిరపడ్డాను. ప్రస్తుతం క్వారీ పనులకు వెళుతున్నాను. కాలనీకి మంచినీటి సమస్య లేకుండా చూడాలి.

– పిన్నంశెట్టి అంజలి, కాలనీ వాసి

సైడ్ కాల్వలు ఏర్పాటు చేయాలి



నేను కాలనీలో 25 ఏళ్ల నుంచి మేదర పని చేస్తూ జీవిస్తున్నాను. ఇంత వరకు సైడు కాల్వలు ఏర్పాటు చేయలేదు. మురుగంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. మాలాంటి వృద్ధులు తిరగాలంటే అవస్థలు తప్పడంలేదు.

– కొండా అంకారావు, కాలనీవాసి

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



డీఎస్పీ హనుమంతురావు

సత్తెనపల్లి: సంక్రాంతి పండగ ముసుగులో కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు హెచ్చరించారు. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. నిబంధనల అతిక్రమించి కోడి పందేలు నిర్వహిస్తే డిస్ట్రిక్ సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రుయెల్టీ టు యానిమల్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. జూదాలు నిర్వహిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కోడి పందేలను ప్రోత్సహించొద్దు

అచ్చంపేట: సంక్రాంతి పండగను గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని అచ్చంపేట సీఐ వెంకట ప్రసాద్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ రాజకీయపార్టీల నాయకులు, గ్రామ ప్రముఖులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. కోడి పందేలను ఎవ్వరూ ప్రోత్సహించవద్దని కోరారు. దొంగతనాల నివారణకు గ్రామాల ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పసుపులేటి పాపిరెడ్డి, నందిగం ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాసరావు, కొనకంటి యజ్ఞప్రసాద్ పాల్గొన్నారు.

కోడి పందెం వేస్తున్న ఐదుగురి అరెస్ట్

బెల్లంకొండ: కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని ఆదివారం అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ డి.ప్రవీణ్ తెలిపారు. చంద్రాజుపాలెంలో ఆదివారం ఉదయం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురుని అదుపులోకి తీసుకుని, కోడి పుంజులు, రూ.1,800 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఐ వెంట కానిస్టేబుళ్లు రాజేష్, మల్లికార్జునరావు, ఎల్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పూజలు



కోలాహలంగా శ్రీవారి గ్రామోత్సవం



కోలాట ప్రదర్శనలో మహిళలు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీవారి దేవాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. తిరుపతి తరహాలో రైల్వేస్టేషన్‌రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి శ్రీవారికి ముత్యాల పందిరి వాహనంలో ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపులో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని శ్రీవారి ఆశీస్సులు పొందారు. వివిధ రూపాల్లో కళాకారుల వేషధారణలు, మక్కపాటి బ్రహ్మం నేతృత్వంలో మహిళల కోలాట ప్రదర్శన అందర్నీ ఆకట్టుకున్నాయి. శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించింది.

వైభవంగా వేణుగోపాలస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో రుక్మిణి సత్యభామ సమేత వేణు గోపాలస్వామి



కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు వైభవంగా భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో పూజలు అనంతరం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి పట్టణ ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవం ముందు మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిన్నారుల్లో సంక్రాంతి శోభ



రంగవల్లి తీర్చిదిద్దుతున్న చిన్నారి



హరిదాసుతో వేషధారణలో..

అచ్చంపేట: చామర్రు వెంకటరాజా ట్రస్ట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు ఆదివారం వేకువజామున ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. భోగి మంటలు వేసి, రంగవల్లులు తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలు పెట్టి చేయి చేయి పట్టుకుని ఆటపాటలతో భోగి మంట చుట్టూ నృత్యాలు చేశారు. చిన్నారి హరిదాసు, గంగిరెద్దు ఆడించే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రామ పెద్దలు ఈ సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొని విద్యార్థులను అభినందించారు.

మధురమైన జ్ఞాపకాల్లో



2004-25 బ్యాచ్ విద్యార్థులు

పెదకూరపాడు: మధురమైన క్షణాలు.. మళ్లీ బాల్యం గుర్తు చేసుకున్న రోజు. 20 ఏళ్ల తర్వాత స్నేహితులతో ఆనందంగా గడిపిన జ్ఞాపకాలు. ఆదివారం పెదకూరపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. వాట్సాప్ వేదికగా నాలుగు నెలలుగా మిత్రులందరూ ఒకరినొకరు పరిచయం చేసుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యా బోధనలు చేసిన గురువులను సన్మానించుకున్నారు. గురువులు మాట్లాడుతూ తమ వద్ద విద్యను అభ్యసించిన విద్యార్థులు నేడు స్థిరపడి ఉన్నత శిఖరాల్లో ఉండటం ప్రతి ఉపాధ్యాయుడికి సంతోషకరమన్నారు. పూర్వ విద్యార్థులు సిద్ధబత్తిని రాజ్యలక్ష్మీ, కావూరి ఏసుబాబు, షేక్ లాల్‌బాష పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బెల్లంకొండ: చిట్టిప్రోలు కాశమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2010- 11 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొన్నారు. దాదాపుగా 15 ఏళ్ల తర్వాత విద్యార్థులు తమ స్నేహితులు, ఉపాధ్యాయులను కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.



సమ్మేళనంలో 2010-11 బ్యాచ్ విద్యార్థులు

వివేకానందుడి ఆలోచనలే స్ఫూర్తి



వివేకానందుడి జయంతిలో శిశుమందిరం విద్యార్థులు



వివేకాంద చిత్రపటానికి నివాళి



విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న అంజనేయులు

అమరావతి: మానవ జీవితం ఆధ్యాత్మికతతో ముడిపడి ఉందని, యుక్త వయస్సులోనే తన బోధనలతో యువతకు స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడు స్వామి వివేకానందుడని విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు వారణాశి వెంకటేశ్వరశర్మ అన్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్లోని వివేకానందుడి విగ్రహానికి సరస్వతి శిశుమందిరం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, నివాళులర్పించిన అనంతరం వారణాసి వెంకటేశ్వర శర్మ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తం చేసిన స్వామి వివేకానంద భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తాడన్నారు. సరస్వతి శిశు మందిరం విద్యార్థులు వివేకానందుని చిత్రపటంతో బోధనలను నినదిస్తూ మెయిన్ బజారులో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం కోలా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువజనోత్సవాలు

అమరావతి: ధరణికోట రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు డిగ్రీ కళాశాలలో జాతీయ యువజనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సభలో చలపతి విద్యా సంస్థల అధినేత ఆంజనేయులు పాల్గొని, మాట్లాడారు. దేశభక్తి, సంస్కృతి, సాంప్రదాయాల్లో భారత ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు వివేకానందుడని పేర్కొన్నారు. బాపట్ల జిల్లా ఇంటర్మీయెట్ ఎడుకేషన్ డైరక్టర్ ఎర్రయ్య, ధాన్య కటక బుద్ధ విహార ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు ప్రసంగించారు. ఈ సందర్భంగా గతేడాది అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ధాన్యకటక ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అకాడమి డైరక్టర్ శివప్రసాద్, అప్పారావు, రామిరెడ్డి దేవా, కళాశాల పాలకవర్గ సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానందుడికి నివాళి

క్రోసూరు: స్వామి వివేకానంద జయంతిని స్థానిక ఆంధ్ర లీగల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వివేకానంద జయంతిని ఏటా పండుగలా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. న్యాయవాదులు నర్రా పిచ్చయ్య, బీఎల్ చిన్నయ్య, నాయక్, శ్రీదేవి, వడ్లమూడి బాలకృష్ణ పాల్గొన్నారు.



శోభాయాత్రలో స్వామి వివేకానంద చైతన్య భారతి బాధ్యులు

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

సత్తెనపల్లి: దేశాభివృద్ధిలో కీలకం యువత అని, అలాంటి యువశక్తికి స్ఫూర్తి స్వామి వివేకానంద అని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకొని నవ చైతన్య వివేక సేవా సమితి సిల్వర్ జూబ్లీ వేడుకలు పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు, ఎంపీపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల హనుమంతరావు, ఆధ్యాత్మికవేత్త మంచికంటి వెంకటేశ్వరరావు, విశ్రాంత ఆచార్యులు సూరం నారాయణరెడ్డి, రిటైర్డ్ అటవీశాఖ అధికారి గాలిబ్‌లు మాట్లాడారు. నవ చైతన్య వివేకా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నోముల వెంకట చలపతిరావు అధ్యక్షత వహించారు. రగ్గులు, స్వామి వివేకానంద పుస్తకాలు పంపిణీ చేశారు. అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు విప్పర్ల పాండురంగారావు, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ వేశాల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శులు దివ్వెల శ్రీనివాసరావు, వెల్లంకి సాయి బాబా, కార్యదర్శులు పాల్గొన్నారు.



వివేకానంద జయంతి వేడుకల్లో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు

- స్వామి వివేకానంద చైతన్య భారతి ఉపాధ్యక్షుడు పుట్టి సాంబశివరావు సంజన వైద్యశాలలో ఆదివారం జరిగిన స్వామి వివేకానంద జయంతి వేడుకల సభకు అధ్యక్షత వహించారు. అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీధర్, సంస్థ సభ్యులు జేపీఎస్ శాస్త్రి, పోతుగంటి రామకోటేశ్వరరావు, వెంకటనారాయణ, సంస్థ గౌరవ అధ్యక్షుడు కొల్లిపర కాశీ విశ్వనాథం స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. తాలుకా సెంటర్‌లోని వివేకానంద విగ్రహం వద్దకు శోభాయాత్రగా వెళ్లారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.
- శ్రీ బాబా గురుదేవ్ జూనియర్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మట్టా సుబ్రహ్మణ్యేశ్వరరావు కళాశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించారు. ప్రిన్సిపల్ తిప్పిరెడ్డి శివారెడ్డి, పీవీఆర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, అంకితభావం అలవర్చుకోవాలి

నరసరావుపేట రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, అంకితభావం అలవర్చుకోవాలని మోటివేషనల్ స్పీకర్ వేణుగోపాల్ తెలిపారు. కేసానుపల్లిలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. 978మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మోటివేషనల్ స్పీకర్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఫోన్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జిల్లాకు తలమానికమవుతుందని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, సంగీతం, యోగ వంటి వాటిలో శిక్షణ ఇవ్వడం వలన శారీరక, మానసిక ఉల్లాసం పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల జనరల్ మేనేజర్ సిహెచ్ రామరాజు మాట్లడుతూ పరీక్షా ఫలితాలను, సర్టిఫికేట్లను విద్యార్థులకు ఈనెల 20వ తేదీ లోపు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నాగోతు ప్రకాష్, ఏవో రఘుపతి, సిబ్బంది పాల్గొన్నారు.